
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

# నల్లకలువ

కె. ప్రవీణ



తూరుపు నుంచి వెలుగు రేఖలు విస్తరిస్తుంటే నా చుట్టూ పేరుకొని ఉన్న చీకటి తొలిగిపోతున్నది. నులి వెచ్చని వెలుగు నాపై పరచుకుంటూంటే ఎంతో హాయిగా ఉంది. రాత్రంతా చీకట్లో బిక్కుబిక్కు మంటూ ఉన్న నేను ఆ స్పర్శకి హర్షాతిరేకంతో వొళ్లంతా కళ్ళు చేసుకుని చుట్టూ కలియజూసాను. అంబరాన్ని తాకేటంత పొడుగ్గా నిటారుగా ఉన్న నాకు పలుచటి పొగమంచు మబ్బులు కప్పుకొని ఉన్న జెర్సీనగరం మసక మసగ్గా కన్పిస్తూంది. కొండలూ, లోయలూ, పచ్చని మైదానాలూ, సరస్సులూ, రోడ్లు, ఫ్లై ఓవర్లూ, అక్కడక్కడా పేర్చినట్లున్న ఇళ్లూ, స్టడ్‌ఫామ్‌లూ, స్ట్రాబెర్రీ తోటలూ, మొక్కజొన్న చేలూ, కొంచెం దూరంగా డౌన్‌టౌన్‌లోని ఆకాశహర్మ్యాలూ...వీటన్నిటితో సర్వాంగ సుందరంగా కనబడుతూందీ నగరం.

నేను పుట్టి ఎన్నాళ్లయ్యిందో గానీ ఎన్నో పగళ్లూ, రాత్రులూ దొర్లిపోయాయి. మొలకెత్తి ఈ లోకంలోకి వచ్చి కళ్ళు తెరిచిన నాకు ఆ నీలాకాశంతో బాటు నా చుట్టూ ఉన్న తుప్పలూ, పొదలూ, చెట్లూ చేమలూ, కొండా కోనలూ కనిపించాయి. మొలక నుండి మొక్కనైనాను. మౌనంగా సృష్టిలోని విషయాలు గమనిస్తూ ఎదుగుతున్నాను. ఏళ్ళు గడుస్తున్నాయి. మానై నిలిచాను. అలా ఎదుగుతూనే ఉన్నాను. నాకు కొండ చరియల కవతల వైపు ఉన్న రోడ్లు, వాటిపై కదిలే వాహనాలు కనిపించాయి. ఇంకాస్త పైకిసాగి నేనిప్పుడు నగరమంతా చూడగలుగుతున్నాను. చూడటమే కాదు. ప్రాపంచిక విషయాలన్నీ ఆకళింపు కూడా చేసుకుంటున్నాను. ఈ సృష్టిలోని విషయాలన్నీ ఒక్కొక్కటే అర్థమవుతున్నాయి. పగలూ, రాత్రీ, రోజూ, వారం, మాసం, ఋతువు... ఇలా అన్ని క్రమాలూ తెలిశాయి. నాపై నివాసం ఏర్పరుచుకున్న పక్షులూ, దూరం నుంచి వస్తూ, వెళ్తూ నా కొమ్మలపై సేదదీరే పక్షులూ ఎన్నో లోక విష

అనుక్షణం కష్టించే రైతన్న - అడుగడుగున సంరక్షించే SBH.



- వ్యవసాయ పట్టభద్రులకు ఋణాలు
- ద్విచక్ర వాహనాలకై ఋణాలు
- గ్రామీణ బండారన్ యోజన
- కోల్డ్ స్టోరేజ్ ఋణాలు
- ట్రాక్టర్ కొనుగోలుకై ఋణాలు

*Conditions Apply

మరిన్ని వివరాలకు మీ సమీప మా శాఖను సంప్రదించండి :

స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD

- పంటలపై రైతులకు ఋణాలు
- కిసాన్ క్రెడిట్ కార్డు సౌకర్యం
- గ్రామీణ గిడ్డంగులకు ఋణాలు
- పంటల విక్రయానికి ఋణాలు

SBH Helpline: 1800-4254055
Website : http//www.sbhyd.com

యాలు చెబుతాయి. రంగురంగుల లవ్‌బర్డ్స్, తెల్లని పావురాలు, పచ్చని చిలుకలు, గోధుమ వన్నెతో ముచ్చట గొలిపే చిట్టిపొట్టి పిచ్చుకలు. అబ్బో ఇలా ఎన్నో రకాల పక్షులు వచ్చి చేరతాయి. కొన్ని నలుపు రంగు పక్షులు కూడా కనబడతాయి. వాటిని చూడగానే ''ఎన్నో అందమైన రంగులుండగా ఆ దేవుడు ఇటువంటి నల్లని పక్షుల్నెందుకు సృష్టించాడో...? అనిపించేది నాకు. నా ఎదురుగా ఓ సరస్సు ఉంది. తెలుపు, ఎరుపు కలువ మొగ్గలతో నిండి ఉన్న ఆ సరస్సును చూసినప్పుడల్లా ''హమ్మయ్య ఆ దేవుడి నల్ల కలువల్ని సృష్టించ లేదు'' అనుకునే దాన్ని. ఆ అందమైన సరస్సులో తెల్లని బాతులతో బాటు నల్లని బాతులు కూడా ఈదులాడుతుంటాయి. నలుపుతో అందవికారంగా కనబడే ఆ బాతులకు కూడా దేవుడు వేరే రంగు పులిమితే బావుండేది'' అని ఎన్నో సార్లు అనుకున్నాను. నాకు నలుపంటే నచ్చదు. అలాగే పగలంతా వెలుగులో లోకాన్ని చూస్తూ పొద్దు గడుపుకునే నాకు రాత్రితో బాటు వచ్చే చీకటంటే కూడా భయమే...! చీకటి కమ్ముకోవడం మొదలవగానే దాన్ని చూడకుండా కళ్ళుమూసుకొని నిలబడే నిద్రపోతాను. మళ్ళీ తూరుపు తెలతెలవారుతూంటే ఒళ్ళు విరుచుకుంటూ నిద్రలేచి నల్లని చీకటి నుంచి విముక్తి కలిగినందుకు సంతోషిస్తాను. మళ్లీ చీకటి పడే వరకు ప్రకృతి అందాల్నీ దూరంగా కనబడే నగర వాసుల దినచర్యనీ గమనిస్తూ ఉంటాను. రోడ్లమీదా, ఫ్లై ఓవర్ల మీదా తళతళలాడుతూ లెక్కలేనన్ని వాహనాలు వేగంగా తిరుగుతూ ఉంటాయి. అబ్బో... ఎన్ని రకాలో? ఎన్నెన్ని రంగులో..? ఎరుపు, తెలుపు, నీలం, పసుపు, నలుపు... వాటన్నిట్లో వెండి మబ్బుల్లా తళతళలాడే సిల్వర్ కలర్ కార్లూ, రాజహంసల్లా మిలమిలలాడే తెలుపు రంగు కార్లూ అంటే నాకు భలే ఇష్టం.

ఇలా కాలచక్రంలో రోజులూ, నెలలూ, ఋతువులూ దొర్లిపోతూనే ఉన్నాయి. ఋతువులన్నిట్లోనూ నాకు వసంతం అంటే ఇష్టం. చలికాలంలో ఆకులన్నీ రాల్చుకొని మంచు ముసుగులో ఉండిపోతాను నేను. వసంతం తెచ్చే నులివెచ్చదనానికి నాపై పేరుకొన్న మంచుపొరలు తొలిగి పోతాయి. ఆ వెంటనే చకచకా చిగుర్లు తొడిగిన నేను అందంగా అలంకరించుకున్న పడుచు పిల్లలా వయ్యారాలు పొలికిస్తాను. గడ్డ కట్టిన సరస్సులోని మంచు కరుగుతూంది. ఎండ తాకిడికి తళతళలాడే నీళ్ళలో కలువ మొగ్గలు తేలి కనువిందు చేస్తూంటాయి. చలికి భయపడి ఎక్కడికో పారిపోయిన బాతుల గుంపులు మళ్లీ కనబడతాయి.

చలికాలంలో దూర ప్రాంతాలకు వలస వెళ్లిన పక్షులూ, మరెన్నో కొత్తపక్షులూ వచ్చి చేరతాయి. ఆ పక్షులు చేసే కిలకిలా రావాల సవ్వడి వివిధ వాయిద్యాల సమ్మేళనంతో కూడిన సంగీతంలా నాకు ఇంపుగా వినబడుతుంది. ఆ శబ్ద మాధుర్యంలో మునిగి తేలుతూ మళ్ళీ వచ్చిన నా నేస్తాలనూ, కాబోయే కొత్త నేస్తాలనూ చూసుకుంటూ చెప్పలేనంత సంబరపడిపోతాను. వసంతం వచ్చిందంటే చాలు వీకెండ్స్‌లో షాపింగ్‌మాల్స్, అమ్యూజ్‌మెంట్ పార్కులు, బీచ్‌లు, లేక్‌ల వద్ద బోటింగ్ స్పాట్‌లు ఇవన్నీ రంగురంగుల దుస్తులు వేసుకున్న జనంతో కళకళ లాడుతాయి. నేలపై కప్పుకున్న మంచు కరిగిపోవడంతోనే ఇళ్ళముందు రంగురంగుల పూలమొక్కలు నాటుతారు. రోడ్లకిరువైపులా పేవ్‌మెంట్ల పక్కన ఉన్నఖాళీ స్థలాల్లోనూ, నీళ్ళు విరజిమ్ముతూన్న ఫౌంటెన్ల చుట్టూ గుత్తులు గుత్తులుగా పూచిన రంగురంగుల పూలతో వన్నెచిన్నెలొలికిస్తూన్న మొక్కలు అక్కడ తిరిగే వాళ్ళదృష్టిని అయస్కాంతాల్లా తమ వైపు లాక్కుంటాయి. రోడ్ల పక్కన స్ట్రీట్‌లైట్ల స్తంభాలకు కూడా గొలుసులతో విరబూసిన పూలకుండీలను వేలాడ దీస్తారు. చలికాలంలో ఒంటినిండా మందపాటి దుస్తులను ధరించే జనం ఈ సీజన్‌లో రంగురంగుల పలుచటి దుస్తులు వేసుకొని తిరుగుతారు. జనంలో తెల్లని వాళ్ళూ, ఎర్రని ఆపిల్ పండు రంగులో మెరిసిపోయేవాళ్ళూ, గోధుమ వన్నెలో ఉన్న వాళ్ళే కాక నల్లటి వాళ్ళూ ఉంటారు. నేనా నల్లని వాళ్ళను చూసినప్పుడల్లా దేవుడందరినీ తెల్లగా ఎందుకు పుట్టించలేదూ...? అనుకుంటూ నా దృష్టిని మరల్చి తోటల వైపు చూస్తాను. నిండుగా కాచిన స్ట్రాబెర్రీ, రాస్‌బెర్రీ తోటలు ముచ్చట గొలుపుతూ ఆకాశంలో నుంచి కెంపులు రాలి పడ్డాయేమోననే భ్రమ కలిగి





**HIV/AIDS కు మందు ఉందా? ఉంది..**

**మీరు గాని, మీ డాక్టరుతోగాని వచ్చి నిజ నిర్ధారణ చేసుకుని 15 రోజులలోనే 25% (4వ వంతు) ఖచ్చితంగా లక్షణములను తగ్గించుకుని మంచి ఆకలిని, నిద్రను పొంది, భయము, ఆందోళన మరియు ఆవేదన తగ్గించుకుని క్రమేణా కంట్రోల్ నార్మల్ నెగిటివ్ ఏదికావాలో మీరే పొందండి**



**ఉచిత కౌన్సిలింగ్** | డాక్టరు పి.ఎస్.వి. సత్యనారాయణ, హెచ్ఐవి/ ఎయిడ్స్ వైద్యం గురించి వైద్య, ఆరోగ్య శాఖ, న్యూఢిల్లీ వారి ప్రశంసలు

1) నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (NACO) తేది: 13/11/00 మీరు ఆరుగురు ఎయిడ్స్ పేషెంట్లకు వైద్యంచేసి (CURE) చేసినందులకు మిమ్ములను అభినందిస్తున్నాము. మా సంస్థ మిమ్ములను ప్రోత్సహిస్తోంది. ఈ శహస్రాబ్దిలో ఎయిడ్స్ రోగుల (400 మంది) కోసం సలిపిన కృషి ఎంతో ప్రోత్సాహకరంగావుంది. ఆ నెగిటివ్ పేషెంట్ల వివరాలు. (1) కుమార్ 21 సం॥, (2) కీరవాణి 1 1/2 సం॥, 3) శైలజ 20 సం॥, (4) రమణ 40 సం॥, (5) రవళి 18 సం॥, (6) వెంకట్ 21 సం॥ పైన తెలిపిన వివరములతోపాటు 1275 మంది చికిత్స పొందిన వారి వివరములుకూడా తెలుసుకొనవచ్చును.
2) ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ICMR) తేది: 28-2-97 నిపుణుల కమిటీచే మీరు పంపిన ఫలితములు ఆమోదించబడి నిజ నిర్ధారణ కొరకు నేషనల్ ఎయిడ్స్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పూణెకు పంపడమైనది.
3) నేషనల్ ఎయిడ్స్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (NARI) తేది: 28-9-01 మీరు ఇచ్చుచున్న 4 రకముల మందులు ఎక్కువ మోతాదులో కూడా ఏవిధమైన దుష్ప్రభావంలేవు మరియు రక్తములో ఉన్న హెచ్ఐవి వైరస్‌కు క్షీణింపచేయుచు ఇమ్యూనిటీని పెంపొందించు శక్తికలిగి వున్నది.
4) సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రిసెర్చ్ ఇన్ ఆయుర్వేద అండ్ సిద్ధ (CCRAS) 29-5-02 ఈతేదీన ఇప్పటి వరకు దాదాపు 400 మంది HIV/AIDS చికిత్స రికార్డులు, రుజువులు, నివేదికలు తెలుపుతున్నాయి. ప్రస్తుత కాలంలో పట్టిపీడిస్తున్న హెచ్ఐవి/ఎయిడ్స్ అనే జటిల సమస్యను పరిష్కరించేందుకు శాస్త్రీయ పద్ధతిలో మీరు గణనీయమైన కృషిచేసారని కౌన్సిల్ అభిప్రాయపడింది మరియు (TOXICITY & STANDARISATION) టెస్టులు చేయుంచుకుని గుడ్ మెడికల్ ప్రాక్టిషనర్ అనిపించుకోండి అని ప్రశంసించినారు. పై టెస్టులో (IICT) వారిచే చేయించబడిన వివరములు.
5) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (IICT) తేది: 11-7-05 1కేజి బరువుగల వ్యక్తికి 2000 మి.గ్రా. (2 గ్రాములు) ఒకరోజు ఇచ్చినను ఏవిధమైన దుష్ఫలితములు లేవు అంటే 60 కేజీల బరువుగల మనిషికి 2x60 =120 గ్రాములు ఒక్కరోజు మోతాదులో ఇచ్చినను ఏవిధమైన సైడ్ ఎఫెక్ట్ దుష్ఫలితములు లేవని నిర్ధారించబడినది. మేము 4 నెలలు (120 రోజులు) ఇచ్చు పూర్తి మందులకు సమానం.
6) డబ్ల్యువిపి నం. 23194 ఆఫ్ 2000 ఈయన ఆయుర్వేద హోమియోపతిలలో మెడికల్ ప్రాక్టిషనర్‌గా సర్టిఫికెట్ కలిగివున్నారు. అవాళ్మిక్-1, అవాళ్మిక్-2, కఫయోగ్, మేదామృత్ అను మందును ఎయిడ్స్ కొరకు ఉపయోగిస్తున్నారు. ఆథరైజ్డ్ రిసెర్చ్ లేబరేటరీస్ ద్వారా ఇతనుయొక్క క్లయిమ్స్ (ట్రీట్‌మెంట్) ఐన్నునని సొసైటీకి రుజువుచేసుకోవాలి (NARI, పూణె, IICT తార్నాక, హైదరాబాద్ మరియు ఇతర రిప్యూటెడ్ లేబరేటరీస్ ద్వారా రుజువుచేసుకోవడం అయినది)
7) తేది 26-4-05 సిసి నం. 934 ఆఫ్ 2002 డా. పి.ఎస్.వి. సత్యనారాయణ, క్వాలిఫైడ్ ఆయుర్వేదిక్ డాక్టర్. మందులు తయారుచేసుకొనుటకు లైసెన్స్ ఉండుటవలన అమ్ముకోవచ్చు పేషెంట్స్‌కూడా ఇవ్వవచ్చునని కోర్టు నిర్ధారించింది.

**జి.పి. ఇన్‌స్టిట్యూట్ (హాస్పిటల్) ఆఫ్ ఆల్టర్‌నేటివ్ థెరపీస్ అండ్ రిసెర్చ్ సెంటర్**

ఇంటి నం. 1-8-499/6, శ్రీ వెంకటేశ్వర స్వామి గుడివీధి, చిక్కడపల్లి, హైదరాబాద్-20.
ఫోన్: 66615411, 27646916, 9849007228 www.gpinstitute.com

స్తుంటాయి. నా చుట్టూ విస్తారంగా ఉన్న పంట పొలాల్లోకి ఫ్రూట్ పికింగ్‌కనీ, వెజిటేబుల్ పికింగ్ కనీ వచ్చే పిల్లాపాపలతో సాయంకాలాలు సందడిగా ఉంటాయి. పిల్లలూ, పెద్దలూ వెదురు బుట్టలు చేతబట్టుకొని స్వయంగా పళ్ళూ, కూరగాయలు కోసుకుంటారు. వాటిని తూకం వేసి, తగిన ధర చెల్లించి కొనుక్కుంటారు. అలా స్వయంగా పళ్ళూ కూరగాయలూ ఎంచుకొని కోసుకోవడం వాళ్ళకెంతో సరదా. చిన్న చిన్న వెదురు బుట్టల్లో చిట్టిపొట్టి చేతులతో తామే స్వయంగా కోసిన పళ్లనూ, కూరగాయలనూ మురిపెంగా చూసుకునే పిల్లల్ని చూడటం నాకూ భలే సరదాగా ఉంటుంది. ఇలాంటివెన్నో వసంతాలు దొర్లాయి. ఏళ్ళకేళ్ళు గడుస్తున్నాయి. నేనలా చేవతేలుతూ ఎదుగుతూనే ఉన్నాను. నేను నిటారుగా ఎదుగుతూంటే నగరం విస్తరిస్తూనే ఉంది.

ఓ రోజు ఉదయాన్నే నేనున్న స్థలం యజమానితో పాటు మరో నలుగురైదుగురు కూడా వచ్చారు. వాళ్ళంతా తెల్లవాళ్ళే. నా పక్కనే నిల్చొని ఆ చుట్టూ ఉన్న స్థలాన్నంతా కలియజూసారు. వాళ్ళ మాటల్ని బట్టి మా ల్యాండ్ లార్డ్ నుండి వాళ్లా పొలం కొనుగోలు చేశారని అర్థమయ్యింది. ఆ తర్వాత వాళ్ళు చాలాసార్లు అక్కడికి వచ్చారు. ఆ స్థలాన్ని లేఅవుట్ చేసి ఇళ్ళు కట్టి అమ్ముతారట. ఆ నలుగురిలో కాస్త లావుగా ఉన్నతని పేరు 'స్టీవ్' అని వాళ్ళ మాటల్లో తెలిసింది. మరికొద్ది వారాలకే అతని పర్యవేక్షణతో పనులు మొదలైనాయి. క్రేన్‌లు, ప్రొక్లెయినర్‌లు, బుల్‌డోజర్లు, టిప్పర్లు వచ్చాయి. ఆ ప్రాంతమంతా చదును చేశారు. ఆ స్థలంలో ''ఇంగ్లీష్ టౌన్'' అని రాసి ఉన్న పెద్ద బోర్డు పెట్టారు. నా పక్కనే కూర్చోవడానికి అనువుగా పొడుగాటి అరుగులు కట్టారు. 'స్టీవ్' వాళ్ళు ఆ అరుగులపై కూర్చొని నిర్మాణానికి సంబంధించిన ఎన్నో విషయాలు చర్చించుకునే వాళ్ళు. ఆ స్థలాన్ని ఇరవై ఒక్క లాట్‌లుగా విభజించాలని ప్లాన్ చేశారు. ఒక్కో లాట్ దాదాపు రెండెకరాలు ఉంటుంది. కాస్త ఆలస్యమైనా అన్ని లాట్‌లనూ తెల్లవాళ్ళకే అమ్మాలనుకున్నారు. నల్లవాళ్ళకు అమ్మితే అక్కడి స్థలం విలువ వెంటనే పడిపోతుందని అనుకున్నారు వాళ్ళు. ముందుగా నా దగ్గర్లోని లాట్‌లో ముచ్చటైన ఇల్లు కట్టారు. అందులో చక్కని ఫర్నిచరు అమర్చారు. వీకెండ్స్ లోనూ, సాయంకాలాలూ, చాలామంది ఆ మోడల్ హౌజ్‌ని చూసి వెళ్తున్నారు. ఆ ఇల్లు నచ్చిన వాళ్ళు లాట్‌లు బుక్ చేసుకున్నారు. దాదాపు అన్ని లాట్‌లల్లో నిర్మాణం పనులు మొదలయ్యాయి. బేస్

**మళ్ళీ వసంతం వచ్చేసరికి అన్ని ఇళ్ళూ పూర్తయ్యాయి. ఆ ఇళ్ళల్లోకి తెల్లటి మనుషులు దిగారు. ఎర్రని ఆపిల్ పళ్ళలాంటి బుగ్గలూ, బంగారపు రంగులో సిల్కులా మెరుస్తున్న జుట్టుతో ఉన్న పిల్లలు బై సైకిల్స్ పైన తిరుగుతూ, స్విమ్మింగ్ పూల్స్ లో ఈదుతూ కన్పిస్తున్నారు.**

మెంట్‌లు పూర్తయ్యాయి. ఆ తర్వాత నీళ్ళు, ఎలక్ట్రిసిటీ సప్లయ్‌కీ, ఏ. సిలకూ, హీటర్‌లకూ, ఎగ్జాస్ట్ సిస్టమ్ కూ అవసరమయ్యే పైప్ లైన్లన్నీ వేశారు. ఆ పై చెక్క ఫ్రేములతో ఇళ్ల స్కెలిటన్‌లు సిద్ధం చేశారు. ఆ స్కెలిటన్‌లని పలకలతో కప్పారు. రూఫ్ పై పెంకులు అమర్చారు. కొన్ని ఇళ్ళ ముందు స్విమ్మింగ్‌పూల్స్ కూడా సిద్ధం అయ్యాయి. పనులు పూర్తయిన ఇళ్లల్లోకి మనుషులు దిగారు. ట్రక్కుల్లో సామాను చేరవేస్తున్నారు. ఇళ్ళల్లోకి దిగిన వాళ్లు ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో ల్యాండ్ స్కేపింగ్ చేయిస్తున్నారు. కారు తిరగడానికి అనువుగా 'డ్రైవ్ వే'లు వేయిస్తున్నారు. 'డ్రైవ్ వే' రోడ్డు వేసే కాంట్రాక్టరు ఓ రోజు నా దగ్గర బల్లపై కూర్చున్న 'స్టీవ్' దగ్గరికి వచ్చి మోడల్ హౌజ్ వంక చూపుతూ ''ఆ ఇంటికి 'డ్రైవ్ వే' వేయిస్తారా'' అని అడిగి ఆ ఇంటినీ ఇంటిచుట్టూ ఉన్న ఖాళీ స్థలాన్నీ తేరిపార చూశాడు. నా వైపు వేలు పెట్టి చూపుతూ ''ఈ దేవదారు చెట్టు అవతలి స్థలం కూడా ఈ లాట్ లోనిదే కదా'' అడిగాడు స్టీవ్‌ని.

అవునన్నట్లుగా తలవూపాడు స్టీవ్.

మరికాస్త అవతలకి జరిగి ఆ స్థలాన్ని కళ్ళతోనే కొలిచినట్లుగా చూస్తున్న కాంట్రాక్టరు పెదాలు ''బ్యూటిఫుల్'' అన్నాయి ఉత్సాహంగా.

ఏమిటన్నట్లుగా స్టీవ్ అతని వైపు చూశాడు.

''ఈ లాట్‌కి ఫ్రంటేజ్ ఎక్కువగా ఉంది. ఈ చెట్టుకూడా నరికితే ఈ ఇంటికి 'డ్రైవ్ వే' సరి అయిన యాంగిల్‌లో అద్భుతంగా వస్తుంది. దాంతో ఈ ఏరియా మొత్తానికి ఈ ఇల్లే చూడముచ్చట అవుతుంది'' అన్నాడు.

అతని మాటలు విన్న నేను భయంతో వణికిపోయాను.

ఆ కాంట్రాక్టరు చెప్పిన వ్యూలో చూసిన స్టీవ్ కూడా అవునన్నట్లుగా తలవూపి ''నిజమే, కానీ ఈ ఇల్లు మేమింకా ఎవరికీ అమ్మలేదు.. దీన్నికొనే వాళ్ళదే 'డ్రైవ్ వే' వేయించుకునే బాధ్యత'' అన్నాడు.

'స్టీవ్' మాటలతో నేను కాస్త ఊరట చెందాను. అంటే నా కింక కొన్నాళ్ళు ఆయువు ఉందన్న మాట...

***

మళ్ళీ వసంతం వచ్చేసరికి అన్ని ఇళ్ళూ పూర్తయ్యాయి. ఆ ఇళ్ళల్లోకి తెల్లటి మనుషులు దిగారు. ఎర్రని ఆపిల్ పళ్ళలాంటి బుగ్గలూ, బంగారపు రంగులో సిల్కులా మెరుస్తున్న జుట్టుతో ఉన్న పిల్లలు బై సైకిల్స్ పైన తిరుగుతూ, స్విమ్మింగ్ పూల్స్ లో ఈదుతూ కన్పిస్తున్నారు. ఉదయం హడావిడిగా ఆఫీస్‌లకు బయలుదేరే వాళ్లతోనూ, సాయంకాలాలు అలసటగా ఇళ్ళు జేరే వాళ్ళతోనూ, ఇంటిపనులూ, తోటపనులూ చేసేవాళ్లతో, ఆ ఇళ్ళలోని పిల్లలను సంరక్షించేందుకు వచ్చే వాళ్ళతోనూ అక్కడంతా సందడి సందడిగా అన్పిస్తూంది ఆ ఇళ్ళలోని మనుషులతో నాకు ఏదో తెలీని అనుబంధం ఏర్పడుతుంది. వీళ్ళంతా నా వాళ్ళు అనే భావం కలుగుతూంది. అన్ని ఇళ్ళలోకీ మనుషులు వచ్చేసారు, ఒక్క మోడల్ హౌజ్ లోకి తప్ప అక్కడున్న ఇళ్ళలోకెల్లా ఆ ఇల్లే చూడ ముచ్చటగా ఉంటుంది. కాస్త ఎత్తైన ప్రదేశంలో ఉంది ఆ ఇల్లు. తాళం వేసి ఉన్నా ఇంటి వైపు ఎప్పటికీ భయంభయంగా చూస్తుంటాను నేను. ఎందుకంటే ఆ ఇంట్లోకి దిగేవాళ్ళే నా చావో బతుకో నిర్దేశిస్తారన్న విషయం నాకు తెలుసు. చావు ఎంత భయంకరంగా ఉంటుందో నేను కళ్ళారా చూశాను. ఈ స్థలాన్ని లే అవుట్ చేసేటప్పుడు నా వంటి ప్రాణులు ఎలా రంపపు కోతకు గురై ప్రాణాలు కోల్పోయాయో ప్రత్యక్షంగా చూసిన నాకు చెట్లు కూలుతున్న ఆ దృశ్యం గుర్తుకు వస్తేనే ఒళ్ళు జలదరిస్తుంది. వీళ్ళందరికీ ప్రాణ వాయువు అందించే మాకు వీళ్ల వల్లే ప్రాణ భయం. ఎప్పుడేమౌతూందో అన్న భయంతోనే రోజులు గడుపుతున్నాను.

ఓరోజు ఉదయాన్నే 'స్టీవ్' వచ్చాడు. అతనితో బాటుగా సన్నగా తెల్లగా చువ్వలా ఉన్న వ్యక్తి కూడా ఉన్నాడు. 'స్టీవ్' తాళం తీసి ఇల్లంతా అతనికి చూపాడు. ఆ వ్యక్తికి ఇల్లు నచ్చిందిలా ఉంది. అతని పేరు 'మైక్' అనీ 'ఫైజర్' కంపెనీలో పనిచేస్తున్నా


Happy Homes are always Built with Housing Loans from SBH

0.50% Less on Interest Rates

50% Discount on Processing Fee

Avail Oct' 31 '06



*Conditions Apply

Helpline : 1800-4254055, website : www.sbhyd.com

स्टेट बैंक ऑफ हैदराबाद

STATE BANK OF HYDERABAD

65 years of dedicated service

నని చెప్పాడు. అతని స్నేహితురాలు 'జెన్నీఫర్' ఆర్లాండో స్టేట్ నుంచి ఇటు వస్తూందనీ ఆమె కోసం ఆ ఇల్లు చూసాననీ లావాదేవీలన్నీ ఓ వారం రోజుల్లో పూర్తి చేస్తాననీ స్టీవ్‌తో చెప్పాడు.

వారం తర్వాత ఆ ఇంటిముందు ఓ తెల్లకారు వచ్చి ఆగింది. ఆ కార్లోంచి గులాబీరంగులో మెరిసి పోతూన్న స్త్రీ ఆమెతో పాటు సుమారు పదీప న్నెండేళ్ళ మధ్య వయస్సులో ఉన్న ఓ నల్లటి అమ్మాయీ దిగారు. ''బ్లాక్ గర్ల్..'' అనుకుంటూ చూశానా అమ్మాయి వంక. నల్లటి దృఢమైన శరీరం, బాగా వంకీలు తిరిగిన నల్లని జుట్టు పాయలు పాయలుగా అల్లి గట్టిగా బిగించి కట్టి ఉంది. ఆ నల్లటి అమ్మాయి కారు ట్రంక్ తెరిచి ''మామ్ కెన్ ఐ గెట్ ద లగేజ్ ఇన్‌సైడ్'' అన్నది. నాకు ఆశ్చర్యం వేసింది. సన్నగా గులాబి మొగ్గలా ఉన్న ఆమెను ఈ నల్లని అమ్మాయి మమ్మీ అని పిలుస్తూందేమిటి.

''ఆష్లీ రిలాక్స్ ఫరెవైల్ ఐ విల్ డూ ఇట్ లేటర్'' అన్నదామె ఇంట్లోకి వెళ్తూ.

ఆమెతో బాటు ఆ అమ్మాయీ ఇంట్లోకి వెళ్ళింది.

ఓ గంట తర్వాత అక్కడికి ఆ రోజు స్టీవ్‌తో ఇంటి లావాదేవీల గురించి మాట్లాడిన మైక్ వచ్చాడు. సాయంకాలానికల్లా ట్రక్‌లో వాళ్ల సామాను వచ్చింది. మైక్ ఇల్లు సర్దడంలో సహాయ పడుతున్నాడు. నా ఎదురుగా ఉన్న గది కిటికీ తెరి చాడు మైక్. ట్రక్ లోంచి తీసికెళ్ళిన అట్టపెట్టెలో నించి పియానో, కీ బోర్డు తీసి ఆ గదిలో సర్దాడు. జెన్నీఫర్ ఓ పెద్ద ఫోటో ఫ్రేము ఆ పియానో బేస్‌పై పెట్టింది. ఫోటోలో జెన్నీఫర్‌తో బాటు ఓ నల్లని వ్యక్తి ఉన్నాడు. వాళ్ళిద్దరి మధ్యలో ఆష్లీ నిలబడి ఉంది. అది నాలుగైదేళ్ళ వయసులో ఉన్నప్పటి ఫోటో. ఓ... అదీ విషయం. జెన్నీఫర్ 'బ్లాక్ గయ్'ని పెళ్ళాడింది. అందువల్లే ఆష్లీ నల్లగా ఉంది అనుకు న్నాను. కొన్నాళ్లు వాళ్ళ దినచర్యని గమనించి వాళ్ల మాటలు విన్న తర్వాత విషయమంతా బోధ పడింది.

విలియమ్ బాస్కెట్ బాల్ ఆటగాడు. జెన్నీఫర్ అతని అభిమాని. వాళ్ళు ప్రేమించి పెళ్ళిచేసుకు న్నారు. విలియమ్ నల్లజాతీయుడైనా అతని మన సులో తన పట్ల ఉన్న ప్రేమకి తలవంచింది జెన్నీ ఫర్. వాళ్ళకు ఆష్లీ పుట్టిన ఆరేళ్ళకి విలియమ్ ఆక్సి డెంట్‌లో పోయాడు. జెన్నిఫర్ పనిచేసే కంపెనీ లోనే పనిచేసే వాడు 'మైక్'. భార్య అతనికి విడాకు లిచ్చి వేరే వ్యక్తిని పెళ్ళాడింది. ఐదేళ్ళ కొడుకు టోనీ మైక్‌తోనే ఉంటున్నాడు. మైక్ స్నేహంలో విలి యమ్ పోయిన దుఃఖాన్నీ, ఒంటరితనాన్నీ మరిచి పోగలుగుతూంది జెన్నీఫర్. రెండేళ్ళు గడిచాయి. మైక్ పెళ్ళికి ప్రపోజ్ చేశాడు. తను ఆలోచించడా నికి గడువు కావాలని కోరిందామె. కొన్ని నెలలు గడిచినా జెన్నీఫర్ సమాధానమేమీ ఇవ్వలేదు. మైక్ మళ్ళీ పెళ్ళి విషయం ఎత్తినప్పుడు ''మైక్ నీకు తెలుసు నేను నల్ల జాతీయుడైన విలియమ్‌ని మన సారా ఇష్టపడి పెళ్ళాడాను. అతనూ నన్నెంతగానో ప్రేమించేవాడు. నా మనసులో విలియమ్ స్థానం ఎప్పటికీ అలానే ఉండిపోతుంది. నన్ను ప్రేమిస్తు న్నానని నువ్వంటున్నావు. నిన్ను నమ్ముతున్నాను. కానీ నా కూతురు బ్లాక్ గర్ల్. నల్లని నా కూతుర్ని తెల్లని నీ కొడుకుతో సమానంగా చూడగలవా? నీ తండ్రి ప్రేమను నిష్కల్మషంగా పంచగలవా? నీ కొడుకు నన్ను తల్లిగా అంగీకరించినట్టే నల్లని ఆష్లీతో ఎలాంటి అరమరికలు లేకుండా తోబుట్టు వుగా మెలగగలడా? ఎందుకంటే ఆష్లీ చాలా సెన్సి టివ్. ఆమె మనసుకు ఏదైనా కష్టం కలిగితే నేను తట్టుకోలేను'' అన్నది. జెన్నీఫర్ భావాలర్థం చేసుకు న్నాడతను. కొద్దిక్షణాలు మౌనంగా ఏదో ఆలోచి స్తూన్నట్లుగా ఉండి పోయాడు.

''జెన్నీ ఐ కెన్ అండర్ స్టాండ్ యువర్ ఫీలింగ్స్. కొన్నాళ్ళిలా స్నేహితులుగానే ఉండిపోదాం. నీకు నా పై అన్ని విధాలా విశ్వాసం కలిగాకే పెళ్ళికి నీ ఆమోదం తెలుపు'' అన్నాడు.

ఆ తర్వాత ఫైజర్ కంపెనీలో మరో మంచి జాబ్ రావడంతో మైక్ 'న్యూజెర్సీ'కి వచ్చేసాడు. ఆర్లాండో నుంచి వచ్చే ముందు ''జెన్నీ నీకూ నాకూ మధ్య ఒక్క ఫోన్ కాల్ దూరమే సుమా'' అన్నాడు.

మైక్ వెళ్ళాక జెన్నీఫర్ ఆర్లాండోలో ఒంటరిగా ఉండలేక పోయింది. తనూ న్యూజెర్సీకి వచ్చేస్తానని మైక్‌కి 'ఈ మెయిల్' చేసింది. త్వరలోనే మైక్




అడుగడుగునా ఆధ్యాత్మికమయం - సాయిగీతా ఆశ్రమం

- ద్రౌపది క్షేత్రం, అభయమూర్తుల క్షేత్రం, గరుడ క్షేత్రం, నవగ్రహ యజ్ఞ గుండం చూడాల్సిందే, చూసి తరించాల్సిందే
- ప్రతి సంవత్సరం, మృగశిర కార్తెనాడు ఉచితంగా ఆస్తమా, బ్రాంకైటిస్ వ్యాధులకు మందు ఇవ్వబడును
- ప్రతిరోజూ ఉచితంగా సాయిక్రియ యోగ చూపించబడును. • ప్రతి ఆదివారం అన్నదానం జరుగుతుంది

ఆశ్రమ ఉచిత వైద్య కార్యకలాపాలు

• బి.పి. • షుగర్ • సాయిబైరాగి యోగిక చికిత్స (కంటి వ్యాధులకు) • పార్శ్వపు తలనొప్పి • జాండీస్ • సైనసైటిస్ • ఫిట్స్, సోరియాసిస్ • మోకాళ్ళ నొప్పులకు ఆయుర్ యోగిక చికిత్స మరియు పసర్ల మందు ఇవ్వబడును



65 అడుగుల ఎత్తు, 25.3 అడుగుల డయామీటర్‌గల ప్రపంచంలోకెల్లా అతి విశిష్టమైన దివ్య గడియారం

డిసెంబర్ ఆఖరి ఆదివారం 31/12/2006నాడు సాయిగీత ఆశ్రమంలో మహిమాన్వితమైన కదంబ, రుద్రాక్ష, కల్పవృక్ష, పుత్రజీవి మొ॥ వృక్షాల మధ్య మహాత్ముల సమక్షంలో సర్వదోష నివారణ మహాయజ్ఞం జరుగును. ప్రజల ఆర్థిక బాధలను దృష్టిలో పెట్టుకొని సర్వదోష నివారణ మహాయజ్ఞంతో పాటు శ్రీ లక్ష్మీ సహిత కుబేర యజ్ఞం జరుపడం విశేషం. దుఃఖాన్ని దూరం చేసి యుగ యుగాల నుంచి ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతి చేసే సుమారు 500 రకాల కన్న ఎక్కువగా వృక్షాలుగల దివ్యక్షేత్రం సాయి గీతా ఆశ్రమం. దేశంలో ప్రజల ఇబ్బందులు, అరాచకాలు దూరమై ప్రకృతి శాంతి, విశ్వకళ్యాణం కోసం కార్యసిద్ధి, న్యాయమైన కోరికలు నెరవేరాలన్న సత్ సంకల్పంతో గత 42 సం॥లుగా వేలాది మంది ఒకేసారి కొబ్బరికాయలు కొట్టే ఈ దోష నివారణ మహాయజ్ఞాన్ని పూజ్య సద్గురు శ్రీశ్రీశ్రీ సాయి కుమార్ బాబాగారు నిర్వహిస్తున్నారు. ఈ యజ్ఞంలో పాల్గొన్నవారు ఊహించని ఫలితాన్ని అందుకున్నారు. మరి మీరెందుకు ప్రయత్నం చేయకూడదు? ప్రయత్నించండి ఫలితాన్ని అందుకోండి.



మహాత్ములతో యజ్ఞం చేస్తున్న శ్రీశ్రీశ్రీ సాయికుమార్‌బాబాగారు

బోయిన్‌పల్లి, మేడ్చల్ - ఎన్‌హెచ్-7, కండ్లకోయ బస్టాప్, రంగారెడ్డి జిల్లా

ఫోన్: 958418248247, 040- 27500127

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

ఆమెకు జాబ్ చూసిపెట్టాడు. ఇల్లు సిద్ధం చేశాడు. ఈ ఇంగ్లీషు టౌన్ లో.

జెన్నీ వాళ్ళు న్యూజెర్సీకి వచ్చి నెల దాటింది. కానీ ఎవ్వరితోనూ పెద్దగా పరిచయాలు కాలేదు. ఇక్కడి ఇళ్ళల్లో ఉన్న శ్వేత జాతీయుల పిల్లలెవ్వరూ ఆష్లీతో స్నేహం చేయడానికి ముందుకు రాలేదు. స్కూలు నుండి ఇంటికి వచ్చాక ఆష్లీ ఒంటరిగా కిటికీ ముందు కూర్చొని బిక్కుబిక్కు మంటూ పరిసరాలు చూస్తూంటుంది.. అప్పుడప్పుడు నా దగ్గర సిమెంటు బల్లపై పుస్తకం చదువుతూ కూర్చుంటుంది. ఎప్పుడన్నా సాయంత్రాలు మైక్ వచ్చేవాడు. అతను ఆష్లీకి పియానో వాయించడం నేర్పుతాడు. అతడు వెళ్ళాక కూడా ఆష్లీ ఎంతో సేపు ఆ గదిలో పియానో సాధన చేసుకుంటూ ఉండిపోతూంది ఒంటరిగా. ఆ శబ్దతరంగాలు కిటికీ గుండా బయటికి వచ్చి నా చెవులకు సోకేవి. చీకటి పడుతూన్న ఆ సమయంలో ఆ చక్కని మ్యూజిక్ నన్ను జోకొడుతుంది. ఆష్లీ ఇక్కడికి వచ్చిన కొన్నాళ్ళలోనే ఆ సంగీతంతో నాకొక అనుబంధం పెరిగింది.

***

ఓ రోజు సాయంకాలం నాక్కాస్త దూరంలో ఉన్న క్లారా ఇంటివైపు వెళ్ళింది ఆష్లీ. క్లారాకు కవల పిల్లలు కూతురు రూబీ కొడుకు టామ్. వాళ్ళా సమయంలో స్విమ్మింగ్ పూల్‌లో ఉన్నారు. స్నేహితులతో కలిసి రంగురంగుల ప్లాస్టిక్ బంతులతో, బెలూన్లతో ఆడుతూ ఈదుతున్నారు. వాళ్ళ కేరింతలు ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తున్నాయి. ఆష్లీ మౌనంగా కాసేపు వాళ్ళని గమనిస్తూ నిలబడింది. ఏదో గుర్తుకు వచ్చినట్లుగా పరిగెత్తుకొని ఇంట్లోకి వచ్చింది. నిమిషాల్లో స్విమ్మింగ్ కాస్ట్యూమ్ ధరించి తల్లి వారిస్తున్నా వినకుండా అటు వెళ్ళింది.

క్లారా వాళ్ళ స్విమ్మింగ్ పూల్ ఫెన్స్ వద్ద నిలబడి 'కెన్ ఐ జాయిన్ యూ పీపుల్' ఆశగా చూస్తూ అడిగింది.

ఉన్నట్టుండి ఓ నల్లపిల్ల ప్రత్యక్షమై 'పూల్'లో దిగుతానని అడిగేసరికి అక్కడి పిల్లలంతా విస్తుబోయి ఏం చెప్పాలో తెలియక ఒకరి ముఖాలొకరు చూసుకుంటున్నారు. ఇంతలో అటు వైపు వచ్చిన 'క్లారా' ఆష్లీ వైపు చూస్తూ ''నోనో.. ఐ యామ్ సారీ ఇది మా పర్సనల్ పూల్. ఇక్కడికి కాస్త దూరంలో ఉన్న క్లబ్‌లో కామన్ పూల్ ఉంది కావాలంటే అక్కడికి వెళ్లు'' మర్యాదగానే చెప్పినా క్లారా చూపుల్లో ''యూ బ్లాక్ గళ్'' అన్న ఏవగింపు కనబడింది.

ఆష్లీ కళ్ళలో నీళ్ళు చిప్పిల్లుతూండగా తన ఇంటి వైపు పరిగెత్తుకు రాసాగింది. మధ్యలోనే ఎదురైన తల్లిని వాటేసుకొని భోరున ఏడ్చేసింది.

జెన్నీఫర్ ఆష్లీని సముదాయిస్తూ నా దగ్గర సిమెంటు బల్లపై కూర్చోబెట్టి తనూ కూర్చుంది.

''ఆష్లీ డోంట్ క్రై, మనం షాపింగ్ వెళ్దాం నీకు చాలా పుస్తకాలూ, బొమ్మలూ, కొనిపెడతాను. పద లోపలికి వెళ్ళి దుస్తులు మార్చుకుందువు గానీ....''

''నో మామ్... ఐ వాంటు గోఫర్ స్విమ్ రైట్ నౌ...''

''ఇప్పటికిప్పుడంటే ఎట్లా? వచ్చేవారం వరకూ క్లబ్‌లో మెంబర్ షిప్ తీసుకుందాం. అక్కడ నువ్వు స్విమ్ చేయవచ్చు.''

''మామ్ ఆర్లాండోలో ఉండగా మన కాలనీలోని స్విమ్మింగ్ పూల్ లో అందరితో కలిసి నేనూ స్విమ్ చేసేదాన్నికదా ఇక్కడి వాళ్ళెందుకు వద్దన్నారు..''

ఆర్లాండోలో మనముండే ఆపార్ట్‌మెంట్స్‌కన్నింటికీ అది కామన్‌పూల్. అందులో ఈదడానికి అక్కడ ఉండే వాళ్ళందరికీ హక్కు ఉంటుంది. కానీ ఇక్కడ ఈ ఇళ్లలో ఉన్నవన్నీ ప్రైవేట్ పూల్స్. అందుకే వాళ్ళు నిన్ను రానివ్వడం లేదు...''

''అదేం కాదు నువ్వబద్ధం చెబుతున్నావు. నేను నల్లపిల్లనని వాళ్ళు వద్దన్నారు. నేను అక్కడ్నించి వచ్చేస్తుంటే వాళ్ళు 'హౌడేర్'... అని, 'బ్లాక్ గర్ల్' అనీ అనుకోవడం నాకు వినబడింది'' వెక్కిళ్ళ మధ్య అన్నది.

జెన్నీఫర్ కళ్ళలో కూడా నీటి తెర కమ్మింది. అది కూతురికి కనబడకుండా కళ్లు కిందికి వాల్చుకొని ''వాళ్ళింట్లోది మామూలు స్విమ్మింగ్ పూల్. చలికాలంలో ఈదలేం. మనింట్లో నేను హీటెడ్ స్విమ్మింగ్ పూల్ కట్టిస్తాను. నువ్వెంచక్కా అన్ని సీజన్లలోనూ స్విమ్ చేయవచ్చు సరేనా.''

''అది ఏలాంటి స్విమ్మింగ్ పూల్ అయితే ఏమిటి? నాకేం సరదాగా ఉండదు. ఎందుకంటే అందులో నేను ఒంటరిగానే ఉండాలిగా'' అంటూ తల్లి చేతి పక్కన తనచేయి పెట్టి చూసుకుంది. ''మమ్మీ వై డిడ్ యూ మ్యారీ బ్లాక్‌గయ్. తెల్లగా ఉన్న వ్యక్తిని పెళ్లి చేసుకొని ఉంటే నేనూ తెల్లగా ఉండేదాన్నిగా''.

కూతురి మాటలు విన్న జెన్నీఫర్ హృదయం బాణం దెబ్బతిన్న లేడిపిల్లలా విలవిల లాడింది. చివరికి ఆష్లీ తన పుట్టుక పైనే అసహ్యం పెంచుకుంటూంది. ఆ లేత హృదయం ఎంత గాయపడితే ఇలాంటి భావం ఏర్పడుతుంది. ఆమెకు కూతుర్ని ఎలా ఓదార్చాలో తెలియలేదులా ఉంది. చప్పున హృదయానికి హత్తుకుంది. ఆమె కళ్లల్లోంచి వరదై పొంగే నీళ్ళు కనబడన్వికుండా.

అప్పుడే అక్కడికి వచ్చాడు మైక్. అక్కడి దృశ్యాన్ని బట్టి ఏం జరిగిందో ఊహించినట్టున్నాడు ''హాయ్ ఆష్లీ లెట్స్ గో ఔట్, త్వరగా రెడీ అవ్వు'' కంఠంలో ఉత్సాహాన్ని జోడించాడు.

అతని మాటలు వినిపించనట్లుగా విచార ముద్రలో అలాగే కూర్చుండి పోయింది ఆష్లీ.

''గెట్ రెడీ'' అతను ఆష్లీ దగ్గరగా వచ్చి చెయ్యి పట్టుకుంటూ అన్నాడు.

''నోవన్ లైక్స్ మీ ఇన్‌దిస్ వరల్డ్, అందుకని నేనెక్కడికీ రాను'' అన్నది ఆష్లీ.


''నువ్వంటే ఇష్టం లేదని ఎవరన్నారు. ఐ లైక్ యూ సోమచ్'' అన్నాడు మైక్.

''వాళ్ళెవరికీ నేనంటే ఇష్టం లేదు'' అలా అంటూంటే ఆష్లీ కళ్లల్లో మళ్ళీ నీళ్ళు నిండాయి.

అతడు ఆష్లీ కళ్ళు తుడుస్తూ ''అలా ఏడవకూడదు వాళ్ళెవరికీ నువ్వంటే ఇష్టం లేదని బాధపడటం ఎందుకు అందర్నీ సృష్టించిన ఆ దేవుడికి నువ్వంటే ఎంతో ఇష్టం తెలుసా'' అన్నాడు.

''నిజమా'' నమ్మలేనట్లుగా చూసిందతని వైపు.

''అవును నీ పేరు ఆష్లీ కదా ఆష్లీ అంటే అర్థం ఏమిటో తెలుసా ఆ దేవుడికి అత్యంత ప్రియమైనది అని. నువ్వు పుట్టగానే ఆ దేవుడు మీ డాడీకి కల్లో కనిపించి నీకు ఆ పేరు పెట్టమన్నాడట తెలుసా నీకు? జెన్నీ నువ్వీ విషయం ఆష్లీతో చెప్పలేదా. అయితే ఆష్లీ ఆదివారం నిన్ను చర్చ్‌కి తీసుకు



వెళ్తాను. ఫాదర్‌ని అడుగు నువ్వంటే దేవునికి ఎంతి ష్టమో చెబుతాడు'' అన్నాడు.

అతడు ఆష్లీ చియరింగ్ అప్ అవడానికి ప్రయత్నిస్తున్నాడని అర్థం చేసుకుంది జెన్నీఫర్.

మైక్ ప్రయత్నం ఫలించింది. ఆష్లీ రెడీ అవడానికి ఇంట్లోకి వెళ్ళింది.

''జెన్నీ ఆష్లీని కాసేపలా తీసుకు వెళ్తాను. నేను వచ్చేటప్పుడు వైన్ తీసుకు వస్తాను. డిన్నర్‌కి టర్కీ రెడీ చేసి ఉంచుతావా'' అన్నాడు.

అందుకామె సరేనన్నట్లుగా తలవూపింది. విలియమ్ పోయాక మైక్ తటస్థపడి ఉండక పోతే తను భయంకరమైన ఒంటరితనంతో బాధపడి ఉండేది. అతని స్నేహంలో భర్త పోయిన దుఃఖం నుండి తను త్వరగానే కోలుకోగలిగింది. కానీ ఈ సమాజంలోని జాతి వివక్షతలతో ఆష్లీ సున్నితమైన మనసు దెబ్బతింటుందేమో నన్న శంక అనుక్షణం పీడిస్తూందిప్పుడు. ఆష్లీ కుంగి పోకుండా ఉండడానికి మైక్ చేస్తున్న ప్రయత్నానికి కృతజ్ఞతతో ఆమె హృదయం నిండిపోయింది. ''థాంక్స్ మైక్'' అంటూ అతన్ని హత్తుకు పోయింది. అతను అంటీ అంటనట్లుగా ఆమె నుదుటిని పెదాలతో స్పృశిస్తూ ''డోంట్ వర్రీ జెన్నీ పరిస్థితులవ్వే చక్కబడతాయి ట్రస్ట్ మీ'' అన్నాడు.

ఆమె అతని స్పర్శ తో సాంత్వన పొందింది. ఇంతలో ఆష్లీ దుస్తులు మార్చుకొని బయటకు వచ్చింది. ''సీ యూ మామ్'' అంటూ మైక్ తో వెళ్ళిపోయింది.

***

మైక్ ఆష్లీలు తిరిగి వచ్చేసరికి చెన్నీ టర్కీ మాంసాన్ని మసాలాతో మారినేట్ చేసి ఓవెన్ లో బేక్ చేసింది. లెట్యూస్, బేబీకట్ కారెట్, అవకాడోలతో సాలెడ్ సిద్ధం చేసింది. ఆష్లీకి ఇష్టమైన ప్లమ్‌కేక్ పై ఐసింగ్ చేసి చెర్రీస్ తో డ్రెస్ చేస్తూండగా వాళ్ళు రానే వచ్చారు.

ఇంట్లోకి వచ్చిన ఆష్లీ కళ్ళు ఆనందంతో తళతళలాడుతున్నాయి. ఈ మధ్య తన కూతురు అంత సంతోషంగా ఉండటం ఎన్నడూ చూడలేదు జెన్నీఫర్.

''మైక్ డిన్నర్ రెడీ అయ్యింది. ఓ పది నిమిషాల్లో నేను ఫ్రెష్ అయ్యి వస్తాను'' అన్నది.

''డజంట్ మాటర్ టేక్ యువర్ ఓన్ టైమ్'' అంటూ ఆష్లీతో గేమ్ రూమ్ లోకి వెళ్ళాడు.

ఆమె స్నానం చేసి వచ్చేసరికి పియానో వాయిస్తున్న ఆష్లీకి సాలెడ్‌తో కలిపిన టర్కీని ఫోర్క్‌తో తినిపిస్తున్నాడు మైక్.

లేత గులాబీ రంగు వైట్ ఫ్రాక్‌లో మంచులో తడిసిన గులాబీలా ఉంది జెన్నీఫర్. ఆమె అందాన్ని కళ్ళతోనే ప్రశంసించాడు. అతని చూపుల్లోని భావాన్ని గ్రహించిన జెన్నీఫర్ బుగ్గలు ఎరుపెక్కాయి. ఆష్లీ భోజనం పూర్తికాగానే మైక్, జెన్నీఫర్‌లు టీవీలో టెన్నిస్ మ్యాచ్ చూస్తూ వైన్ సిప్ చేస్తున్నారు. ఫ్యామిలీ రూమ్ కున్న పెద్ద కిటికీని కప్పి ఉండే వెనీషియన్ బ్లైండ్స్ పక్కకు తొలగించి ఉండటంతో నాకు ఆ ఇంట్లో ఏం జరుగుతుందో కనిపిస్తూనే ఉంది. ఆష్లీ పియానో వాయిస్తోంది. కిటికీ లోంచి తేలివచ్చే ఆ చక్కటి మ్యూజిక్ వింటూ ఆ ఇంట్లో ఏం జరుగుతూందో చూస్తున్నాను నేను. మ్యాచ్ పూర్తయ్యింది. ఆ తర్వాత మైక్ జెన్నీఫర్‌లు డిన్నర్ తీసుకున్నారు. ఆష్లీ పియానో పై తలవాల్చి అలాగే నిద్రపోయింది. మైక్ లేచి ''నేను వెళ్తాను జెన్నీ'' అంటూ నిద్రపోతున్న ఆష్లీని తీసుకు వచ్చి మంచం పై పడుకో బెట్టాడు. అతడు వెళ్ళబోతూంటే ఆష్లీ నిద్రమత్తులోనే మైక్ చెయ్యి పట్టుకొని ''వై డోంట్ యూ స్టే బాక్ హియర్'' అన్నది.

''ఇంకెప్పుడైనా ఉండి పోతాను ఆష్ ఇప్పుడు వెళ్లాలి. ఇంట్లో టోనీ ఒంటరిగా ఉన్నాడు కదా'' అన్నాడు.

అవునన్నట్లుగా చూసిందతని వైపు అతని చెయ్యి విడువలేనట్లుగా గట్టిగా బిగించి పట్టుకుందొక్క క్షణం ఆచేతిని ముద్దు పెట్టుకొని వదిలి వేస్తూ ''గుడ్ నైట్'' అన్నది.

''గుడ్‌నైట్ మై స్వీట్ హార్ట్ ఐ లవ్యూ'' అన్నాడు.

బయటికి వెళ్తూన్న అతని వైపు మెరిసే కళ్ళతో చూస్తూండిపోయింది ఆష్లీ.

వెళ్తూన్న మైక్ వెనకే గుమ్మం వరకూ వచ్చింది జెన్నీఫర్. ఆమె కళ్ళలోనూ మైక్ ఉండి పోతే బావుంటుంది అన్న భావం కనబడుతూంది నాకు. ''బై జెన్నీ సీయూ'' అంటూ వెళ్ళి కార్లో కూర్చు


దీపావళి శుభాకాంక్షలు



కాకతీయ

మ్యారేజెస్ ప్రై.లిమిటెడ్

An ISO 9001 : 2000 Organisation

Website : www.kaakateeya.com www.telugumarriages.com

"శతమానం భవతి" "పాతికేళ్ల చరిత్రగల కాకతీయ మ్యారేజెస్ పెళ్లి సంబంధాలు కుదర్చడంలో విశేష పాత్ర వహిస్తున్న విషయం ఎల్లరెరిగిందే. అన్ని స్థాయిలవారికి, అన్ని కులాలవారికి వారివారి ఇష్టానిష్టాలు మేరకు తగిన సంబంధాలు ఏరి కూర్చడంలో తిరుగులేని సేవలు మావి.

ONLINE FREE REGISTRATION & FREE SEARCH

హైదరాబాద్ : 103,109 & 203, విజయ శ్రీ అపార్ట్‌మెంట్స్, అమీర్‌పేట్. 040-32973366, 32963777, 23747777, hyderabad@telugumarriages.com

హైదరాబాద్ 2 : ఇ.నం. 9-75/ఎ, పుల్లారెడ్డి స్వీట్స్ బిల్డింగ్, రెండవ అంతస్తు, సాయిబాబా గుడి రోడ్, దిల్‌సుఖ్‌నగర్. 040-24068989, 32974040, hy@telugumarriages.com

హైదరాబాద్ 3 : ఫ్లాట్ నం.202, ఉదయకృష్ణ కాంప్లెక్స్, కె.ఎస్.బేకర్స్ పైన, కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు. 040-32003333, 9391311444

విజయవాడ : 40-9-69, సెంట్రల్ బ్యాంక్ వీధి, బెంజి సర్కిల్ దగ్గర, కళానగర్, 0866-2475555, 3256868, 3299898 hy@telugumarriages.com

గుంటూరు : 3/2, అశోక్ నగర్. 0863-2212222, 3293366, guntur@telugumarriages.com

తెనాలి : ఫ్లాట్ నం.102, వనితా అపార్ట్‌మెంట్స్, బాలాజీరావ్ పేట్, రైల్వే స్టేషన్ దగ్గర, 08644-329998, 320998, tenali@telugumarriages.com

విశాఖపట్నం : 47-3-1-17, 101, కాంప్లెక్స్, 5వ లైన్, ద్వారాకానగర్, 0891-2749798, 3297627, vizag@iqara.net

రాజమండ్రి : ఇ.నం. 46-11-29, ఫ్లాట్ నం.4, శ్రీవినాయక టవర్స్, దానవాయిపేట్. 0883-2473675, 3250424, rajahmundry@telugumarriages.com

కాకినాడ : 9-11-131, 1వ అంతస్తు, గాంధీ నగర్, గాంధీ బొమ్మ సెంటర్, 0884-2346666, 3294040, kd@telugumarriages.com

ఖమ్మం : 11-3-65/1, నెహ్రూ నగర్, రిజిస్ట్రేషన్ ఆఫీస్ ప్రక్కన, ఖమ్మం. 08742-243434, 329866, km@telugumarriages.com

ఒంగోలు : 37-1-159/43, లంబాడి డొంక, లక్ష్మీ సాయి రెసిడెన్సీ వెనుక, కర్నూల్‌రోడ్, ఒంగోలు. 08592-229999, 08592-329898, ongole@telugumarriages.com

నెల్లూరు : ఫ్లాట్ నం.3, గ్రీన్ మెడోస్ అపార్ట్‌మెంట్స్, సరస్వతీ నగర్, దర్గామిట్ట, నెల్లూరు 0861-2314031, 0861-3297979, ne@telugumarriages.com

తిరుపతి : 8/66, 1వ అంతస్తు, శ్రీనివాసా శానిటరీ, సిండికేట్, ఆర్.సి. రోడ్. తిరుపతి. 0877-3293366, tirupathi@telugumarriages.com

చెన్నై : 093400 99993, చెన్నై 1 : 093839 99999 చెన్నై 2 : 098412 82222

బెంగుళూరు : 093429 39346, బెంగుళూరు 1 : 093429 39343, మైసూరు : 093429 39342, కోయంబత్తూర్ 098423 14444, సేలం 0427-3251122, మధురై 098421 73333, వెల్లూరు 098429 61666, తిరుచ్చి 098428 01111, పాండిచ్చేరి 098421 27777

MICHIGAN, U.S.A. : KRISHNA YALAMANCHI, 3362, TURN BERRY LANE, ANN ARBOR, MI48108, USA 734 548 0235, Krishna@kaakateeya.com, MADHU KETINENI, 3233, MONUMENT ANN ARBOR, MI 48108, 734 - 678 - 0498, madhu@kaakateeya.com

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

న్నాడు మైక్. చీకటి పడగానే నిద్రపోయే నేను ఈ రోజు ఆ ఇంట్లో ఏం జరుగుతుందో చూడాలన్న కుతూహలంతో మేల్కొని ఉన్నాను. వెళ్లిపోతూన్న మైక్ కారు లైట్ల వెలుగు దూరమయ్యే వరకూ చూస్తూ నిల్చున్న జెన్నీఫర్ ఇంట్లోకి వెళ్లి తలుపులు మూసింది.

***

అప్పుడు చీకట్లో ఉన్నానన్న స్పృహలోకి వచ్చాను నేను. కానీ నాకిప్పుడే మరో విషయం అర్థమవుతూంది. నేను దడుచుకునే చీకట్లో కూడా ఈ లోకం అందంగా కనబడుతూందనీ ఆకాశంలో కాంతులు వెదజల్లే చంద్రుడు ఉంటాడనీ లెక్కలేనన్ని నక్షత్రాలు చమక్కుమంటాయనీ నాకీ వేళ నల్లని ఆష్లీ ముఖం లోని పెద్దపెద్ద కళ్ళల్లో ఆ మెరిసే నక్షత్రాల చమక్కులు కనిపించాయి.

***

ఎండాకాలం వచ్చేసింది. ఆ రోజు ఆదివారం. దూరం నుండి చర్చిగంటలు వినిపిస్తున్నాయి. క్లారా ఇల్లు సందడిగా ఉంది. కవలలు టామ్, రూబీల పుట్టినరోజు విందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సాయంకాలం అయ్యేసరికి సరస్సుకు ఓ వైపు ఉన్న ఖాళీ స్థలంలో కనోపీలు ఉన్న టేబుళ్ళు వేశారు. వాటి చుట్టూ కుర్చీలు వేశారు. స్టీవ్ బృందం ఈ స్థలానికి లే అవుట్ చేస్తున్నప్పుడే ఆ సరస్సును బోటింగ్ చేయడానికి అనువుగా తీర్చిదిద్దారు. సరస్సు చుట్టూ ఉన్న స్థలంలో కొంతమేరకు చక్కని ల్యాండ్ స్కేపింగ్ చేశారు. ఓ వైపు కొయ్య పలకలతో డెక్ వేశారు. చుట్టూ ఫెన్స్ వేసి గేటు పెట్టారు. అక్కడున్న ఇరవై ఒక్క ఇళ్ళ వాళ్ళూ ఆ ఆవరణని వాడుకోవచ్చు. కాకపోతే మేన్‌టేనెన్స్‌కి డబ్బుకట్టాలి. పార్టీ ఏర్పాట్లు పూర్తయ్యేసరికి అతిథులు వొక్కరొక్కరే అక్కడికి చేరుకుంటున్నారు. ఎక్కడి నుంచో ఇంపైన పక్షికూత వచ్చేవారికి ఆహ్వానం పలుకుతున్నట్లుగా వినబడుతూంది. అది కంఠంలో తేనె నింపుకున్నంత తియ్యగా ధ్వనిస్తూంది. ఏ పక్షి అలా పలుకుతూందో నన్న కుతూహలంతో పాట వచ్చిన వైపు చూసాను. సింధూర వృక్షం పై బోలెడన్ని రంగురంగుల పక్షులు కిచకిచమంటున్నాయి ఇంతలోనే ఆ పక్షి ఎక్కడికెళ్లిందబ్బా? నా వెనక నుండి మళ్ళీ వినబడింది తియ్యని ఆ కంఠం. వెనక్కి చూశాను. అక్కడున్న 'వీపింగ్ ట్రీ' చిటారు కొమ్మపై ఉన్న నల్లని పక్షి మళ్లీ కూసింది. మధురాతిమధురంగా. అలాగే మళ్ళీ మళ్ళీ కూస్తూనే ఉంది. అది నిలబడ్డ సన్నటి కొమ్మ లయబద్ధంగా వూగుతోంది. కూస్తూ కూస్తూ తుర్రుమని ఎగిరి అక్కడికి కాస్త దూరంలో ఉన్న సరుగుడు చెట్టుపైన వాలింది. మరి కాసేపటికి కనబడనంత దూరం ఎగురుతూ వెళ్ళిపోయింది. కూత వినిపించడం ఆగిపోయింది. ఆ నల్లని పిట్ట మళ్ళీ వస్తే బావుంటుందని నాకు పదేపదే అనిపించింది. నా దృష్టిని విందు వైపు మళ్ళించాను. అక్కడ కొందరు బీయర్ తాగుతూ కూర్చున్నారు. మరి కొందరు స్విమ్మింగ్ పూల లోకి దిగారు. పిల్లలంతా వాళ్ళకోసం ఏర్పాటు చేసిన గేమ్స్ ఆడుతున్నారు. టీనేజ్ కుర్రాళ్లూ, అమ్మాయిలూ సరదాగా బోటింగ్ చేస్తున్నారు. ఆ ప్రాంతమంతా నవ్వులతో, కేరింతలతో కోలాహలంగా ఉంది.

నా దగ్గర కూర్చున్న ఆష్లీ ఇవేవీ పట్టనట్లుగా పుస్తకం చదువుతూంది. ఆ మొహం వొలికించే భావాల్లో ఆమె అంతరంగం పసిగట్టడం నేర్చిన నేను ఓ సారి ఆష్లీ వంక చూసాను. ఆ ముఖం తేటగా ఉంది. ఎలాంటి నిరాశా నిస్పృహలూ కనిపించడం లేదు. ఆమె కళ్ళు నిర్మలంగా ఉన్నాయి. ఇంతలో జెన్నీఫర్ వచ్చి ఆష్లీ పక్కన కూర్చుంది. ఆమె దృష్టంతా అక్కడికి కాస్త దూరంలో నవ్వుతూ తుళ్ళుతూ సరదాగా ఉన్న పిల్లలపైనే ఉంది. ఓ సారి ఆష్లీ వైపు చూసింది. జాలిగా నిట్టూర్చింది. ఇవేవీ పట్టని ఆష్లీ పుస్తకం చదవడంలో లీనమై ఉంది.

''నిన్న నువ్వు మైక్‌తో ఎక్కడికి వెళ్ళావు'' అడిగింది ఆష్లీని.

''వాళ్ళింటికి అక్కడ మంచి స్విమ్మింగ్ పూల్ ఉంది. నేనూ మైక్ చాలాసేపు స్విమ్ చేశాము. మైక్ నాకు నీళ్ళడుగున ఈదడం కూడా నేర్పాడు తెలుసా'' ఉత్సాహంగా చెప్పింది ఆష్లీ.

''ఓ దట్స్ గుడ్ అయితే మైక్ కొడుకు టోనీ మీతో పాటు స్విమ్ చేయ లేదా....?''

''నో..మామ్''

''ఎందుకని''

''-------''

''వై'' మళ్ళీ రెట్టించి అడిగింది జెన్నీఫర్. ఆష్లీ చెప్పే సమాధానం కోసం ఆమె ఆత్రంగా ఎదురు చూస్తూంది.


''---టోనీ స్విమ్ చేయలేడు'' ఆష్లీ జవాబులో జెన్నీఫర్‌కి సరైన సమాధానం దొరికినట్టుగా లేదు.

''అదే--- ఎందుకని'' అడిగింది మళ్ళీ. ఓ నల్ల పిల్ల పూల్ లో ఉండగా టోనీ దిగడానికి ఇష్టపడి ఉండక పోవచ్చునన్న శంక ఆమె ముఖంలో మెదిలింది.

''ఎందుకంటే టోనీకి ఒక కాలు లేదు. ఆ లోపం కారణంగా అతను ఈదలేడు. కానీ ఒడ్డున కూర్చొని మేం ఈదుతున్న దృశ్యాన్ని చక్కగా స్కెచ్ వేశాడు. దానికి రంగులు వేసి నా కిస్తానన్నాడు'' చెప్పుకు పోతూంది ఆష్లీ.

''ఏమిటి మైక్ కొడుకు టోనీ అవిటివాడా'' అప్పుడే విషయం తెలిసిన జెన్నీఫర్ దిగ్భ్రాంతికి లోనయ్యింది.

తన కొడుకు అవిటివాడన్న విషయాన్ని ఇన్నాళ్ళ పరిచయంలో మైక్ తనకెన్నడూ చెప్ప లేదు ఎందుకని ఓ అవిటివాడికి తల్లిగా తను



బాధ్యతవహించడానికి జంకుతాననుకున్నాడా? ఏమో? జెన్నీఫర్ ఆలోచనలో మునిగిపోయింది.

యథాలాపంగా విందు జరుగుతున్న వైపు చూసిన ఆష్లీ ఉలిక్కిపడింది. ఓ పక్కన పెద్ద వాళ్ళందరూ మధ్యంలో మునిగి ఉన్నారు. సరస్సులో బోటు అల్లంత దూరంలో కనబడుతూంది. పిల్లలంతా ఆటల్లో లీనమయ్యారు. సరస్సుకు దగ్గర్లో ఒంటరిగా ఉన్న పసివాడిని ఎవరూ గమనిస్తున్నట్లు లేదు. ప్రమాదం తెలియని ఆ పసివాడు నీళ్లను చూసి కేరింతలు కొడుతూ ముందుకు వెళ్తూనే ఉన్నాడు. ప్రమాదం పసిగట్టిన ఆష్లీ చటుక్కున లేచి నిలబడింది. ఆ పసివాడు మరో అడుగు ముందుకు వేశాడు. ఆష్లీ మెరుపు వేగంతో పరిగెత్తుతూంది. వాడు మరో అడుగు వేశాడు.

ఆష్లీ వేగంగా అటు వైపు పరిగెత్తుకు రావడం చూసిన వాళ్ళకేం జరుగుతూందో అర్థం కాలేదు. మరు నిమిషంలో సరస్సులోకి దూకిందామె. అక్కడి వాళ్ళంతా ఏం జరుగుతూందో తెలియక విస్తుబోయి చూస్తున్నారు. క్షణాల్లో ఆ పిల్ల వానితో నీళ్ళపైకి తేలిన ఆష్లీని చూసి ''ఓ మైగాడ్'' అని అరుస్తూ అటు వైపు పరిగెత్తారందరూ. ఒకరిద్దరూ పెద్దవాళ్ళు నీళ్ళలోకి దూకి ఇద్దరినీ ఒడ్డుకు చేర్చారు. నీళ్లు మింగిన పసివానికి ఫస్ట్ ఎయిడ్ చేశారు. తల్లి వాడిని అక్కున చేర్చుకుంది. పసివాని తండ్రి ఆష్లీని దగ్గరకు తీసుకొని ''థాంక్స్ ఎలాట్ మైడియర్...గాడ్ బ్లెస్ యూ'' అంటూ నుదుటిపై ముద్దు పెట్టుకున్నాడు. అక్కడున్న వాళ్ళంతా ఆష్లీని అభినందించారు. అంతమంది తెల్లవాళ్ళ మధ్యలో ఉన్న నల్లని ఆష్లీ వింతకాంతితో వెలిగిపోతూన్నట్లనిపించింది నాకు. అకస్మాత్తుగా జరిగిన సంఘటనను బొమ్మలా నిలబడి చూస్తూండిపోయిన జెన్నీఫర్ తేరుకొని నీళ్ళల్లో తడిసి ముద్దైన ఆష్లీని ఇంట్లోకి తీసికెళ్ళింది.

***

మరో వారం గడిచింది. డ్రైవ్ వే లో రోడ్డు లేసే కాంట్రాక్టరు ఈ మధ్య రెండుసార్లు వచ్చి జెన్నీఫర్‌తో మాట్లాడి వెళ్ళాడు. నాకు ఆయువు మూడినట్లే ఉందని ఖాయం చేసుకున్నాను. మహా అయితే కొన్ని రోజుల్లోనో వారాల్లోనో నా జీవితం ముగియబోతూంది.

ఆరోజు సాయంత్రం ఆష్లీ, జెన్నీఫర్‌లు ఈవినింగ్ వాక్‌లో ఉండగా మైక్ వచ్చాడు. అతనితో బాటు క్రచ్ సహాయంతో నడుస్తూన్న అబ్బాయి వచ్చాడు. అతడు టోనీ అని అర్థం చేసుకున్నాను నేను. వస్తూనే టోనీ తన చేతిలో రోల్ చేసి ఉన్న కాగితం విప్పి తను గీసిన బొమ్మని ఆష్లీకి చూపించాడు. ముగ్గురు వ్యక్తులు ఈదుతూన్న దృశ్యం ఉంది అందులో. ఆ ముగ్గురిలో మైక్, ఆష్లీ, టోనీల పోలికలు స్పష్టంగా కనబడుతున్నాయి. చక్కని రంగుల కలయికతో జీవం ఉట్టిపడేలా చిత్రీకరించిన ఆ చిత్రాన్ని చూసిన ఆష్లీ ''వా..వ్ అమేజింగ్ టోనీ యూ డిడ్ ఎ గుడ్ జాబ్'' అని మెచ్చుకుంటూ అతని భుజంపై చెయ్యివేసింది. పద మనం ఇంట్లోకి వెళ్దాం. పియానోలో నీ కిష్టమైన ట్యూన్ వినిపిస్తాను'' అన్నది. చెయ్యీ చెయ్యీ కలుపుకొని ఇంట్లోకి వెళ్తున్న వాళ్ళవైపు చూస్తూండిపోయిన జెన్నీఫర్ మైక్ కలుపుకొని ఇంట్లోకి వెళ్తున్న వాళ్ళవైపు చూస్తూండి పోయిన జెన్నీఫర్ మైక్ వైపు తిరిగింది. ''నాకీ విషయం ఎందుకు చెప్పలేదు మైక్'' అస్పష్టంగా పలికాయి. ఆమె పెదవులు.

''ఏ విషయం'' అన్నాడతను.

''టోనీ...కాలు...అలా..''

ఆమె మాటలు పూర్తి కాకమునుపే అన్నాడతను ''టోనీ అవిటితనం నాకెప్పుడూ గుర్తు రాదు. అదో లోపంగా భావించలేదు ఎందుకంటే అవయవాలన్నీ సక్రమంగా ఉన్న వాళ్ళు చేయలేని పనులెన్నో టోనీ చేయగలడు. అతను ఈదలేక పోతేనేం ఈదేవాళ్ళ బొమ్మలు వేయగలడు. తనూ ఈదుతున్నట్లు బొమ్మవేసుకొని అందులో ఆనందాన్ని వెతుక్కోగలడు. టోనీ చదరంగం ఎంత బాగా ఆడతాడో తెలుసా...జెన్నీ సందర్భం వచ్చింది కాబట్టి నీకో విషయం చెబుతాను వింటావా. ఆష్లీ బ్లాక్ గర్ల్ అన్న విషయం నీ మనసులోంచి తుడిచి వెయ్యి. ఆమె పై జాలి పడటం మానుకో. నువ్వలా చేసినప్పుడే ఆష్లీ కూడా తను నల్లపిల్లగా జన్మించటం ఓ




स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्वल भविष्य Glorious Past-Brighter Future

శాపం అన్న అభిప్రాయాన్ని మార్చుకోగలుగుతుంది. తనని తాను అసహ్యించుకోవడం, సెల్ఫ్‌పిటీతో కుంగి పోవడం మానుకుంటుంది. మొన్నా మధ్య జరిగిన సంఘటన గుర్తు చేసుకో తనో నల్లపిల్లననీ, ఆ తెల్ల వాళ్ళ మధ్యకు వెళితే అవమానం పాలవుతాననీ సందేహించి ఉంటే ఓ పసిప్రాణం గాల్లో కలిసిపోయేది కదా. నేను ఆష్లీలో గమనించిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే తను బాగా స్విమ్ చేస్తుంది. ఈదుతున్నప్పుడు ఆమె కదలికల్లో సొరచేప స్ఫురించింది. సాధన చేస్తే ఎన్నో విజయ సోపానాలనధిగమించి ఉన్నత శిఖరాల్ని అధిరోహిస్తుంది''

తను కన్న కూతురి గురించి తనకే తెలియని విషయాలెన్నో చెబుతూన్న మైక్ వంక అలా చూస్తూండిపోయింది జెన్నీఫర్.

చెప్పడం పూర్తి చేసిన మైక్ తదేకంగా తననే చూస్తున్న జెన్నీఫర్‌తో ''జెన్నీ ఏమైంది నీకు అలా చూస్తావెందుకు నేనేమన్నా పొరపాటుగా మాట్లాడానా'' అడిగాడు.

''నో మైక్ అలాంటిదేం లేదు. ఇప్పుడే నాకో విషయం అర్థమైంది''

''ఏమిటది'' ఆతృతగా అడిగాడు.

''ఆష్లీకి తండ్రితో బాటు మంచి గురువును కూడా ప్రసాదించాడు ఆ దేవుడు'' ఆమె ఇకపై మాట్లాడలేకపోయింది. కానీ తన మనసులోని సంతోషాన్ని అతనితో పంచుకోవాలన్నట్లుగా అతన్ని హత్తుకుంది. అతని చేతులు ఆమె భుజాలను చుట్టుకున్నాయి. వాళ్ళ పెదాలు కలుసుకున్నాయి. బయట చీకటి పడుతూండటంతో అందరి ఇళ్ళ ముందూ లైట్లు వెలుగుతున్నాయి. పియానోలో బ్లాక్‌రేడ్స్‌నుంచి వచ్చే సంగీతం ఎంతో ఆహ్లాదంగా వినిపిస్తూంది.

***

ఆరోజు పెద్ద ట్రక్కు వచ్చింది. జెన్నీఫర్ ఇంట్లోని సామానంతా అందులోకి ఎక్కిస్తున్నారు. ఆష్లీ వాళ్ళు మైక్ ఇంటికి వెళ్ళిపోతున్నారు. గేమ్‌రూమ్‌లోంచి ప్యాక్ చేసిన పియానోని ట్రక్‌లోకి ఎక్కిస్తుంటే నాకు చెప్పలేనంత దిగులు కలిగింది. వాళ్ళు వెళ్ళిపోతూంటే కొన్నాళ్ళు నా ప్రాణం నిలుస్తుందేమోనన్న ఆనందం కంటే ఎవరో ఆత్మీయుల్ని కోల్పోతున్నానన్న దిగులే ఎక్కువగా అనిపిస్తూంది నాకు. ఇవ్వాళ కాకపోతే రేపైనా నా ప్రాణం పోవాల్సిందే కదా. మళ్ళీ ఆ ఇంట్లోకి వచ్చే వాళ్ళెవరైనా డ్రైవ్ వే వేయిస్తారు కదా! నేనిలా ఆలోచనల్లో మునిగి ఉండగా జెన్నీఫర్, ఆష్లీలు వెళ్ళిపోతున్నారు. వెళ్ళేముందు ఎందుకనో ఆష్లీ ఒక్కసారి వెనక్కి తిరిగి నా వంక చూసింది. ఆ కళ్లల్లో ఒక మెరుపు తళుక్కున మెరిసింది ప్రసన్నంగా ఉన్న ఆమె ముఖంలో ఏదో సాధించానన్న సంతృప్తి కనబడింది. నేను ఇన్నాళ్ళుగా ఆష్లీ ముఖంలో ప్రతిఫలించే ప్రతి భావాన్నీ అర్థం చేసుకున్నాను. ఆనందం, దుఃఖం, ఉత్సాహం, వుద్వేగం, అసహనం, ఇలా ఎప్పటికప్పుడు ఆ పాప ముఖంలో పలికే భావాలను గమనించి ఆమె మానసిక స్థితులను అర్థం చేసుకొని ప్రతిస్పందించేదాన్ని. కానీ ఈ రోజు ఆమె నా వైపు చూసిన ఆ చూపు లోని భావం ఏమిటో అర్థం చేసుకోలేక పోయాను.

వాళ్ళు వెళ్ళిపోయాక కొన్నాళ్ళు భారంగా గడిచాయి.

ఆ ఇంట్లోకి మరో కుటుంబం దిగింది. ఓ రోజు డ్రైవ్‌వే కాంట్రాక్టరు ఇంటి యజమాని 'జాన్' ని కలిశాడు. డ్రైవ్ వే వేయడానికి అంగీకరించాడు. 'జాక్'. పనులు మొదలయ్యాయి. నా బతుకు దినదిన గండంగా మారింది. నా కిప్పుడు చావు భయం పోయింది. హద్దులు గీస్తున్న కాంట్రాక్టరు తో ''ఈ దేవదారు చెట్టు నరక్కుండా ప్లాన్ చెయ్యమన్నాడు జాన్''


''అట్లా అయితే డ్రైవ్ వే షేప్ ఔట్ అవుతూంది'' చెప్పబోయాడు కాంట్రాక్టరు.

''అయినా పర్వాలేదు. నేనీ ఇల్లు కొనేటప్పుడు అలాగే అగ్రిమెంటు చేసుకున్నాను. ఆ షరతు పైనే అప్పట్లో ఈ ఇల్లు గల వాళ్ళు నాకు అమ్మారు'' జాన్ మాటలకు ఆశ్చర్యపోయిన కాంట్రాక్టరు ''షరతా అదెలా'' కాస్త ఆశ్చర్యంగా అడిగాడు. విషయమేమిటో తెలుసుకోవాలన్న కుతూహలం అతని కళ్ళల్లో కన్పిస్తూంది.

అతనితో బాటు నిలువెల్లా చెవులు చేసుకొని నేనూ వింటున్నాను. జాన్ చెబుతున్నాడు. ''ఈ ఇల్లు కొనాలనుకున్న నేను ఇంటి ఓనరు దగ్గరికి వెళ్ళాను. వాళ్ల అమ్మాయి ఆష్లీ అప్పట్లో మీరు వేసిన డ్రైవ్ వే ప్లాను చూపింది. ''సరే నాదో విన్నపం. ఇందులో గీసిన ఈ ప్లాను ప్రకారం 'డ్రైవ్ వే' వేస్తే అనవసరంగా అక్కడున్న ఓ పెద్ద చెట్టును నరకాల్సి వస్తుంది. కాస్త పక్క నుంచి వేస్తే సరిపోతుంది కదా'' అన్నది.

''ఆ ఇల్లు నేను కొన్నతర్వాత నా ఇష్టం వచ్చినట్లుగా డ్రైవ్ వే వేసుకునే హక్కు నాకుంది కదా'' అన్నాను. నా మాటలు విన్న ఆ అమ్మాయి కళ్ళలో చెప్పలేనంత బాధ రెపరెపలాడింది.

''నిజమే, కానీ మీరా చెట్టును పడగొట్టకుండా డ్రైవ్ వే వేయించే షరతు మీదేమేము ఆ ఇల్లు అమ్ముతాం. మీరు ఆ చెట్టును అలాగే ఉండనిచ్చేట్లయితే డ్రైవ్ వే కయ్యే ఖర్చు పాతికవేల డాలర్లు తగ్గించి ఈ ఇల్లు మీకే అమ్ముతాం'' అన్నది ఆ పిల్ల తల్లి జెన్నీఫర్. నిజానికి నేను పాతిక వేలు లాభం కదా అనే ఆ షరతుకు ఒప్పుకున్నాను'' అన్నాడు జాన్.



జాన్ చెప్పింది విన్న నాకు ఆష్లీ వెళ్ళిపోతూ నా వైపు చూసిన ఆ చూపులోని భావం అర్థమయ్యింది. నన్నెలాగైనా కాపాడతాను అనుకున్న ఆమె నమ్మకమే ఆ కళ్ళల్లో ఆ మెరుపును మెరిపించి ముఖంలో ఆ సంతృప్తిని కలిగించిందేమో?

ఆష్లీ దయవల్ల నేను ఆకాశం వైపు ఎదుగుతూనే ఉన్నాను. ఎన్నో ఏళ్ళు గడిచాయి. విస్తరించిన కొద్దీ విశాల ప్రపంచాన్ని మరింత గమనిస్తున్నాను. ఇప్పుడు ఆష్లీ ఎక్కడుందో? ఎలా ఉందో? మంచి ముత్యం లాంటి స్వచ్ఛమైన మనసు కలిగిన ఆ 'నల్లకలువ' ఎక్కడున్నా పదికాలాలు పాటు నాలాగా చల్లగా ఉండాలని కోరుకుంటూనే ఉంటాను అనుక్షణం.